# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలైంది.
- ❖ క్యాన్సర్ నివారణపై... ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు డి.పురంధరేశ్వరి పిలుపునిచ్చారు.
- ❖ అగ్ని ప్రమాదాల నివారణపై పూర్తి అవగాహన కల్పించాలని పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ అధికారులకు సూచించారు.

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నా స్నేహితుడు చంద్రబాబు నాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. భవిష్యత్ రంగాలపై దృష్టి సారించి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన అవిశ్రాంతంగా పని చేస్తున్న విధానం అభినందనీయమని, ఆయనకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవనం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా... అంటూ ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు నిర్వహించుకోవాలని రాష్ట్ర అభివృద్ధికి ఆయన కృషి కొనసాగాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షిస్తూ.. ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జన్మదిన వజ్రోత్సవ శుభ సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సంపూర్ణ ఆయుషును, ఆనందాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

====================

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల 347 ఉద్యోగాలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మెగా డిఎస్సికి సంబంధించిన పూర్తి సమాచారం, సంబంధిత జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షల షెడ్యూల్, సిలబస్, సహాయ కేంద్రాల వివరాలను పాఠశాల విద్యాశాఖ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. డీఎస్సీ దరఖాస్తులను మే 15వ తేదీ వరకు స్వీకరిస్తారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మే 30 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని.. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు సిబిటి విధానంలో పరీక్షలు జరుగుతాయని ఉత్తర్వుల్లో పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో డీఎస్సీకి ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరిస్తూ... రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఒక వీడియో విడుదల చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావాహులు హర్షం వ్యక్తం చేశారు.

====================

అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో అగ్ని ప్రమాదాల నివారణపై పూర్తి అవగాహన కల్పించాలని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి. జి .భరత్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఈరోజు కర్నూలు ఏ - క్యాంపు అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశంలో మంత్రి ప్రసంగిస్తూ... జనసమూహం ఉండే అపార్ట్మెంట్లు, సినిమా హాలులు, ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, పాఠశాలలు, పరిశ్రమలు, పెట్రోల్ పంపులు మొదలగు ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అవగాహన పెంచాలని చెప్పారు. పొరపాటున ప్రమాదం జరిగితే ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా తీసుకొనవలసిన చర్యలు అక్కడ ఉన్నవారికి తెలియజేయాలని అగ్నిమాపక అధికారులను కోరారు. పాఠశాలల విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో 101 నెంబర్ కి సమాచారం ఇవ్వడంపై అవగాహన కల్పించాలని కోరారు.

====================

క్యాన్సర్ నివారణపై... ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని... రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు డి. పురంధరేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడ పటమటలో ఒక క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి ఈ రోజు దశ్యమాధ్యమ విధానంలో ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... పట్టణాలకే పరిమితమవుతున్న ఆధునిక వైద్య సదుపాయాలు గ్రామాలకూ చేరువచేయాలని కోరారు. ధూమపానం, గుట్కాల వలన క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, వీటిని నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. క్యాన్సర్ వైద్యానికి అయ్యే ఖర్చు భరించలేక చాలా మంది పేదరికంలో కూరుకుపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని పురంధరేశ్వరి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

విరామం

====================

ఆదర్శ రాజకీయవేత్తగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తారని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు అన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి 75వ పుట్టిన రోజు సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్లో 'స్వర్ణాంధ్రప్రదేశ్ సారథి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాలు' పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాలతో తీర్చి దిద్దిన రెండు పుస్తకాలను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుతో కలిసి ఉపసభాపతి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ఏదైనా కొత్త విషయాన్ని చిన్న కుర్రాడు చెప్పినా.. శ్రద్ధగా వింటూ కాలాన్ని మర్చిపోయి, నిత్య విద్యార్థిగా ఆసక్తిగా నేర్చుకుంటారని చెబుతూ....

(వాయిస్ 24 సెకన్లు)

ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కె. అచ్చెన్నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

=====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈనెల 23న పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుంచి 28 సంవత్సరాలు ఉన్న నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్ సైట్ లో నమోదు చేసుకొవాలని తెలిపారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఈరోజు అనకాపల్లి జిల్లాలోని ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంరతం పుట్టినరోజు వేడుకలు నక్కపల్లిలో మంత్రి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హుద్‌హుద్ వంటి విపత్తుల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు తోడుగా నిలిచారని గుర్తు చేశారు. రాబోయే తరాలకు ఆయన స్ఫూర్తిదాయకంగా ఉంటూ.. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా ఉంచేందుకు పని చేస్తున్నారని మంత్రి అనిత చెప్పారు.

=====================

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 22వ తేదీన విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం విజయనగరం చేరుకొని 3 గంటల 30 నిమిషాలకు నెల్లిమర్ల మండలంలోని తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు ప్రాజెక్ట్ పనులు, పునరావాసం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటారని ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

=====================
=====================